రైల్వే ఉద్యోగిపై దాడి చేసిన వారిని శిక్షించాలి
డివిజనల్ సెక్రటరీ రవీందర్

రైల్వే మహిళా ఉద్యోగిని పరామర్శిస్తున్న రవీందర్

మారేడ్‌పల్లి, మే 30: విధి నిర్వాహణలో ఉన్న రైల్వే మహిళా టిక్కెట్ చెకింగ్ ఉద్యోగిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ రవీందర్ అన్నారు. యశ్వంత్‌పూర్ నుంచి గోరఖ్‌పూర్ వెళ్తున్న గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్2 బోగిలో విధులు నిర్వహిస్తున్న మహిళ టీటీ విజే.హనిపై అంగంతకులు దాడి చేశారు. వెంటనే రైల్వే సిబ్బంది టీటీ హనిని భువనగిరిలోని ఓ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సను నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్య కోసం లాలాగూడ లోని రైల్వే ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ రవీందర్ తో పాటు పలు వురు యూనియన్ నాయకులు ఆసుపత్రికి చేరుకొని దాడికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి ధర్, ఏడీఎస్‌లు చిలుకు స్వామి, నాగలక్ష్మి, కోశాధికారి నర్సింహారెడ్డి, టికెట్ చెకింగ్ స్టాఫ్ బ్రాంచ్ సెక్రటరీ రాజి రెడ్డి, ఎస్ అండ్ టి బ్రాంచ్ సెక్రటరీ వినయ్, కుమార్ పాల్గొన్నారు.

వృద్ధుడు మృతి

కాచిగూడ, మే 30 : కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(70)బుధవారం రాత్రి కాచిగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-5లో అనారోగ్యంతోమృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నాలాల్లో..వ్యర్థాలు

- చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయిన నాలాలు
- కనిపించని వ్యర్థాల తొలగింపు
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు

బేగంపేట్, మే 30: రానున్నది వర్షాకాలం.. నాలాలను ఇప్పటికే శుభ్రం చేయాల్సింది. అలాంటిది ఏ నాలా చూసినా చెత్త చెదారాలు, పూడికలతో దర్శనమిస్తున్నాయి. ఓ మోస్తారు వర్షం పడిందంటే నాలాలన్నీ ఉప్పొంగే ప్రమాదముంది. నాలాల శుభ్రత కోసం కోట్లు వెచ్చిస్తున్నారు. అయినా లక్ష్యం నెరవేరడం లేదు. నాలాల్లో పూడిక వ్యర్థాల కారణంగా వర్షాకాలంలో నాలాల వెంట ఉన్న బస్తీలు, కాలనీలకు వరద ముంపు తప్పడం లేదు. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్ నుంచి కళాసీగూడ, నల్లగుట్ట, కాచ్‌బౌళి, మినిష్టర్‌రోడ్డు, అంబేద్కర్‌నగర్ మీదుగా ప్రవహిస్తూ ఓ ప్రధాన నాలా హుస్సేన్ సాగర్ నాలాలో కలుస్తుంది. నల్లగుట్ట జూలమ్మ దేవాలయం నుంచి కాచ్‌బౌలి కనకదుర్గ దేవాలయం వరకు నాలాలో పూర్తిగా చెత్త, మట్టి నిండిపోయిన మురికి నీరు ఏ మాత్రం వెళ్లక పోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. అయిప్పటికీ అధికారుల్లో ఏ మాత్రం చలనం కనిపిస్తలేదు. నల్లగుట్ట కాచ్‌బౌళి ప్రాంతం గుండా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు, దుర్వాసనతో అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

ధనియాలగుట్ట నాలాల్లో .. పేరుకుపోయిన చెత్త

బేగంపేట్ నాలాల్లో భరించలేని దుర్వాసన

కూకట్‌పల్లి, అమీర్‌పేట్ నుంచి వచ్చే నాలా బేగంపేట్ కట్టమైసమ్మ దేవాలయం వెనక కలుస్తాయి. ఇక్కడి నుంచి బ్రాహ్మణవాడి మీదుగా ప్రవహించి హుస్సేన్‌సాగర్ నాలాలో కలుస్తుంటాయి. కట్టమైసమ్మ ఆయలం వెనక పూడిక తీవ్రంగా పెరిగిపోయింది. అలాగే ధనియాలగుట్ట సమీపంలో లింక్ రోడ్డు వద్ద కనిపించే నాలాలో వ్యర్థాలు విపరీతంగా పేరుకుపోయాయి. ఈ నాలాలన్నింటిని త్వరగా క్లీనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది.

అరవై శాతం శుభ్రత పనులు చేపట్టాం

బేగంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రధాన నాలాల్లో ఇప్పటికే పూడికతో పాటు వ్యర్థాల తొలగింపు పనులు ఇప్పటికై అరవై శాతం పూర్తి చేశాం. ప్రధానంగా నల్లగుట్ట, కళాసీగూడ, బేగంపేట్ కూకట్‌పల్లి నాలాను ఎప్పటి కప్పుడు శుద్ధి చేస్తున్నాం.. ప్రత్యేకంగా సిబ్బంది ఏర్పాటు చేసి నాలాల్లో పూడిక చెత్తను తొలగిస్తున్నాం. ఇప్పటి వరకు ఆరవై శాతం క్లీనింగ్ పూర్తి చేశాం. త్వరలో అంతర్గత నాలాలు చేయాల్సి ఉంది.
సుదర్శన్, జీహెచ్ఎంసీ బేగంపేట ఈఈ

తొలగించవద్దు

తెలంగాణ రాష్ట్ర అధికారిక లోగో నుంచి చార్మినార్‌ను రాష్ట్ర ప్రభుత్వం తొలగించడంతో... మాజీ మంత్రి కేటీఆర్ ధర్నాకు పిలుపునివ్వడంతో గురువారం కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్ నుంచి జీహెచ్ఎంసీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సీఎన్. నర్సింహ ముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్‌కు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నర్సింహముదిరాజ్ చార్మినార్ ఫొటోతో ఉన్న జ్ఞాపికను అందజేశారు.
– మారేడ్‌పల్లి, మే 30

నృత్య పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీజీపీసీబీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా గురువారం పీసీబీ ప్రధాన కార్యాలయంలో నృత్య పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ విభాగం అధికారులు ప్రభాకర్, దేవేందర్, పీసీబీ అధికారులు జె.సుమతి, పర్యావరణ శాస్త్రవేత్త మాధురితో పాటు పర్యావరణ విభాగం ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు. అమీర్‌పేట్, మే 30:

దివ్యాంగులు మానసికస్థైర్యంతో ఎదగాలి

సమావేశంలో మాట్లాడుతున్న దివ్యాంగులు

అడ్డగుట్ట, మే 30 :దివ్యాంగులు మానసిక స్థైర్యంతో బలమైన భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని కమిట్మెంట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఝాన్సీ అన్నారు. అడ్డగుట్ట బాబూ జగ్జీవన్ రామ్ భవనంలో యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఝాన్సీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... మేనరికం వల్ల గానీ, పోషకాహార లోపం వల్ల గానీ, పుట్టిన తర్వాత సరైన వైద్యం అందించకపోవడం వల్ల గానీ వైకల్యం వస్తుందని తెలిపారు. దివ్యాంగులిద్దరు పెళ్లి చేసుకోవడం ద్వారా కూడా వికలాంగులు పుట్టే అవకాశాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. వికలాంగుల పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం డిస్కౌంట్‌తో చదవించవచ్చునని, అంతేకాకుండా ఒకవేళ వ్యాపారం చేసుకునే ఉద్దేశ్యం ఉంటే రుణాలను కూడా పొందవచ్చునని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దు

సీతాఫల్‌మండి పరిధిలో సురేష్ థియేటర్ పక్కనే ఉన్న జీహెచ్ఎంసీ ఖాళీ స్థలంలో పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి చాయ్ పే చర్చ నిర్వహిస్తున్న అధికారులు

సికింద్రాబాద్,మే 30: బహిరంగ ప్రదేశాలల్లో చెత్త వేసి పరిసరాలను అపరిశుభ్రం చేయొద్దు అని సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ అధికారి రజనీకాంత్ సూచించారు.గురువారం ఉదయం సీతాఫల్‌మండి సురేష్ థియేటర్ పక్కనే ఉన్న జీహెచ్ఎంసీ ఖాళీ స్థలంలో పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మన ఇంటి చెత్తను అటు,ఇటు ఎటు వద్దని స్వచ్ఛ ఆటోలకు మాత్రమే ఇవ్వాలన్నారు. అదేవిధంగా చెత్తను బహిరంగ ప్రదేశాలతో పాటు ఎక్కడ పడితే అక్కడ వేయ వద్దన్నారు. చెత్తను ఆరు బయట వేయడం, మూత్ర విసర్జన చేస్తే రూ 1000 వరకు జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది,శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

పురాతన ఇండ్లు కూల్చివేత

అడ్డగుట్ట, మే 30: సికింద్రాబాద్ జీహెచ్ఎమ్‌సీ సర్కిల్ పరిధిలోని అడ్డగుట్ట, మెట్టుగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన పురాతన ఇండ్లను గురువారం టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ రజిత మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్‌లలో శిథిలావస్థకు చేరిన ఇండ్లను గుర్తించి సదరు యజమానులకు ముందస్తు నోటీసులను అందజేసి కూల్చివేతలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు పురాతన ఇండ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న ఇండ్ల విషయం తెలిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలని ఆమె తెలిపారు. టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారిణి సరితా, చైన్‌మెన్‌లు నాగయ్య, చందు, ఆంజనేయులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ పరిధిలో పూరాతన ఇండ్లను కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

ప్రధాని మోదీ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి

తేళ్ల శ్రవణ్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, మే 30: దేశ ప్రధాని నరేంద్ర మోదీ ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ గురించి చరిత్ర తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ రాష్ట్ర అధ్యక్షుడు తేళ్ల శ్రవణ్‌కుమార్ హితవు పలికారు. 1982లో గాంధీపై సినిమా విడుదలయ్యే కంటే ముందు మహాత్మా గాంధీ గురించి ప్రపంచానికి తెలియదని చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. స్వార్థ రాజకీయాలతో ఎన్నికల్లో లబ్ధి పొంది, తిరిగి అధికారం చేజిక్కించుకునేందుకు మోడీ, షా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో రాజకీయం చేస్తూ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. నిత్యావసర ధరల పెంపు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో సాధారణ ప్రజానీకానికి బతుకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కుల గణన అనంతరం ఎన్నికలు నిర్వహించాలి

చిక్కడపల్లి, మే 30 : కుల గణన అనంతరం బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్)రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్య ప్రకాశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'స్థానిక ఎన్నికలు– బీసీ రిజర్వేషన్లు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదోగోని రవి, బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీసీ డిక్లరేషన్ ద్వారా చేసిన వాగ్దానం ప్రకారం రాష్ట్రంలో కుల గణ అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో జనాభా దాదాపు 65 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం వాటా లేకుండా రాష్ట్ర సమగ్రాభివృద్ధి అనేది అసాధ్యమైన విషయమని అన్నారు.

స్థానిక సంస్థల రిజర్వేషన్లను వర్గీకరణ చేయాలి

కవాడిగూడ, మే 30: వెనకబడిన తరగతుల స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని కోరుతూ వివిధ వృత్తి సంఘాల రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేము నరేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. వృత్తి సంఘాల సమస్యలపై సానుకూలంగా స్పందించిన వేము నరేందర్‌రెడ్డి స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ న్యాయమైనదని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చిట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఏ కులాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎం. బాగయ్య, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొర్రీగల శ్రీనివాస్, ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, యూత్ ప్రెసిడెంట్ అంబటి మల్లయ్య, సుధాకర్ గంగపుత్ర, దీటి సత్యనారాయణ గంగపుత్ర, పాకఎలామ్, వడ్డెర వృత్తిదారులు సంఘం ప్రధాన కార్యదర్శి వల్లపు విగ్నేశ్, తెలంగాణ నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ నాగరాజు, తెలంగాణ వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నారం మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు వేము నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న వృత్తి సంఘాల ప్రతినిధులు

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మే 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులైన బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సు ల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండు, మూడు, అయిదో సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షా ఫీజును వచ్చే నెల 3వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

వివిధ బీఈ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ (నాన్ సీబీసీఎస్) సప్లమెంటరీ, బీఈ (ఏఐసీటీఈ) రెగ్యులర్, సప్లమెంటరీ, బీఈ (సీబీసీఎస్) బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త వహించాలి

మేడ్చల్ రూరల్: మండలంలోని కోనాయిపల్లి, డబిల్‌పూర్, రాజబొల్లారం, రాజబొల్లారం తండాలో విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.ప్రభుత్వ అనుమతి ఉన్న డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాలు కొన్నప్పుడు రశీదు తీసుకోవాలన్నారు.

మా బస్తీలో ప్రైవేటు పాఠశాల వద్దు

మూకుమ్మడిగా నిరసన తెలిపిన తిలక్‌నగర్ వాసులు

అంబర్‌పేట, మే 30 : నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ స్ట్రీట్ నంబర్ 15లో నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు పాఠశాల ఏర్పాటును బస్తీవాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ మేరకు గురువారం పాఠశాలను ఏర్పాటు చేసే భవనం వద్ద తిలక్‌నగర్ యంగ్‌మెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.ఎస్. ప్రసాద్, జనార్దన్, శివ, శ్రీకాంత్, హరి, రాజమ్మ, రాధిక తదితరులు మాట్లాడుతూ.. తమ బస్తీలో 17 ఇండ్లు ఉన్నాయని, ఇంతకు ముందే ఒక స్కూల్ కూడా ఉందని చెప్పారు. ఆ స్కూల్ విద్యార్థులు వెళ్లడానికి రోడ్డు ఉందని, కానీ ఇప్పుడు ఏర్పాటు చేస్తామంటున్న స్కూల్ భవనానికి ఎలాంటి రోడ్డు లేదని, డెడ్ ఎండ్‌లో ఏర్పాటు తగదన్నారు. నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుందని, ప్రస్తుత బిల్డింగ్‌కు వెంటిలేషన్, ఫైర్‌సేఫ్టీ, ప్లేగ్రౌండ్ వంటి సౌకర్యాలు ఏవీ లేదని చెప్పారు. రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ కార్యక్రలాపాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అందరి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. విద్యాశాఖ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. వెంటనే పాఠశాల అనుమతిని రద్దుచేయాలని అధికారులను కోరారు.

ప్రైవేటు పాఠశాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేస్తున్న తిలక్‌నగర్ వాసులు

అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటాం

చర్లపల్లి, మే 30: చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్ 3లో అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకుంటున్నామని పారిశ్రామికవాడ ఫేజ్ 3 అధ్యక్షుడు మియ్యాపురం రమేశ్, ఐఓసీఎల్ పరిశ్రమ ప్రతినిధి రహుల్‌గుప్తాలు పేర్కొన్నారు. పారిశ్రామికవాడలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆఫ్ లిమిటెడ్, పారిశ్రామికవాడ ఫేజ్ 3 సీఐఏ ప్రతినిధులు, ఐలా ప్రతినిధులు ఐఓసీఎల్ పరిశ్రమలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

రాజామొహల్లా బస్తీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్, మే 30: బస్తీలు, కాలనీల్లో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం రాజామొహల్లా బస్తీలో పర్యటించి ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న చేతిపంపులను పవర్ బోర్లుగా మార్చి, మంచినీటి సమస్యను తీర్చాలని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. నారాయణగూడ జలమండలి జీఎం రామకృష్ణ, మేనేజర్ మహేందర్‌రెడ్డితో చర్చించి పవర్ బోర్లుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.రామన్ గౌడ్, జక్కి,జగదీశ్, రితేశ్ పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 30 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్) ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మొదటి, రెండు, మూడు, నాలుగు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 19వ తేదీ నుంచి, ఎంసీఏ అన్ని సెమిస్టర్ల ప్రాక్టికల్ పరీక్షలను వచ్చే నెల 10వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.o smania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్, మే 30: కులాంతర వివాహం చేసుకున్నాడనే అక్కసుతో ఓ యువకుడిపై దాడి చేసి అతడి మృతికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారుపాక అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా, కోహిర్ మండలం, బడంపేట్ గ్రామానికి చెందిన బేగరి నర్సింలు మరోగ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి మే 1న పెండ్లి చేసుకున్నాడని తెలిపారు. యువతి కుటుంబీకులు ఈనెల 18న నర్సింలును పట్టుకొని అతడిపై దాడిచేయగా తీవ్రంగా గాయపడటంతో నర్సింలు కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తీసుకొచ్చారని తెలిపారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని వెల్లడించారు. మృతుడు నర్సింలు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలువాలని, కుల దురహంకార హత్యను ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు. హత్యపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.